ఆధునిక కోర్సులతో ఉజ్వల భవిత

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కేంద్రాలుగా తీర్చిదిద్దనున్నందున విద్యార్థుల ఉజ్వల భవితకు పునాదులు పడతాయని కలెక్టర్ శ్రీహర్ష తెలిపారు. శుక్రవారం ఆయన సమీకృత పాలనా ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 65 కేంద్రాలను ప్రయోగాత్మకంగా ఎంపిక చేయగా అందులో పెద్దపల్లి, రామగుండం కళాశాలలున్నాయన్నారు. కొత్త కోర్సులను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా ఉపాధి కల్పన అధికారి తిరుపతిరావు, పెద్దపల్లి, రామగుండం ఐటీఐల ప్రిన్సిపల్స్ వెంకట్‌రెడ్డి, సురేందర్ పాల్గొన్నారు.

అనాథ పిల్లల సంరక్షణకు పటిష్ఠ చర్యలు: జిల్లాలో అనాథ పిల్లల సంరక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్రీహర్ష సూచించారు. శుక్రవారం సమీకృత పాలనా ప్రాంగణంలో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఆశ్రమాల్లో అనాథ పిల్లలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్ పాల్గొన్నారు.

పకడ్బందీగా గ్రూప్స్ పరీక్ష ఏర్పాట్లు: జిల్లాలో గ్రూప్స్ పరీక్షలకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ శ్రీహర్ష సూచించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి టీజీపీఎస్సీ ఛైర్మన్ నిర్వహించిన దూరదృశ్య మాధ్యమ సదస్సులో ఆయన పాలనా ప్రాంగణం నుంచి హాజరయ్యారు. జిల్లాలో 18 పరీక్ష కేంద్రాలు గుర్తించామని వెల్లడించారు. అదనపు కలెక్టర్ అరుణశ్రీ, డీసీపీ రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

పక్కాగా నీటి నాణ్యత పరీక్షలు: ప్రజలకు స్వచ్ఛమైన జలం అందించేందుకు నీటి నాణ్యత పరీక్షలు పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ శ్రీహర్ష సూచించారు. మిషన్ భగీరథ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రయోగశాలలో నాణ్యత ప్రమాణాల రిజిస్టరును పరిశీలించారు. తాగునీటి సరఫరాలో అలసత్వం వీడాలని సూచించారు. ఈఈ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీఐలకు సాంకేతిక సొబగులు

■ అందుబాటులోకి ఆరు ఆధునిక కోర్సులు

■ ప్రయోగాత్మక కేంద్రాల్లో రామగుండం, పెద్దపల్లి

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్



పోటీ ప్రపంచంలో నైపుణ్యం ఉంటేనే ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. ఆధునిక సాంకేతికత అందుబాటులోకి వచ్చాక ఆదరణ కోల్పోయిన ఐటీఐలకు పునర్వైభవం తెచ్చే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వాటిని అధునాతన సాంకేతిక కేంద్రాలు(అడ్వాన్స్‌డ్ టెక్నికల్ సెంటర్లు)గా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. ఈ ఏడాది నుంచి కొత్తగా ప్రవేశపెట్టే ఆరు కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. నైపుణ్య లేమితో అవకాశాలు కోల్పోతున్న విద్యార్థులకు ఈ కేంద్రాలు బాసటగా నిలవనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రయోగాత్మకంగా ఎంపిక చేసిన 65 ఐటీఐల్లో పెద్దపల్లి, రామగుండం పారిశ్రామిక శిక్షణ కేంద్రాలకు చోటు దక్కింది.

ఈ ఏడాది నుంచే ప్రవేశాలు

విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపునకు ఆరు ఆధునిక కోర్సులు అందుబాటులోకి తెచ్చారు. మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్, ఆర్టీసియన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్, బేసిక్ డిజైనర్ అండ్ వెరిఫైర్, అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మిషనింగ్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికిల్స్ కోర్సుల్లో ఈ ఏడాది నుంచి ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఇప్పటివరకు ఐటీఐలో ఫిట్టర్ ఎలక్ట్రీషియన్, వెల్డర్, మోటార్ మెకానిక్, డీజిల్ మెకానిక్ తదితర కోర్సుల్లో పెద్దగా అవకాశాలు దక్కడం లేదు. దీంతో ఆధునిక సాంకేతిక కోర్సుల్లో విద్యార్థులకు మెరుగైన నైపుణ్యాలు అందనున్నాయి.

రూ.4.77 కోట్లతో భవనం

- అధునాతన సాంకేతిక కేంద్రాల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం టాటా టెక్నాలజీస్ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది.
- పెద్దపల్లి ఐటీఐ ఆవరణలో రూ.4.77 కోట్లతో నూతన భవన సముదాయాన్ని నిర్మిస్తున్నారు.
- ఇప్పటికే కోర్సులకు సరిపడా కొన్ని యంత్రాలు వచ్చాయి. మిగిలినవి కూడా త్వరలో రానున్నాయి.
- కోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు యంత్రాలను సిద్ధం చేస్తున్నారు.
- ఇప్పటివరకు ఐటీఐలు పూర్తి చేసిన విద్యార్థులు కూడా కొత్త కోర్సుల్లో ప్రవేశాలు తీసుకోవచ్చు.


పెద్దపల్లిలో నిర్మిస్తున్న అధునాతన సాంకేతిక కేంద్ర భవనం

కోర్సు ముగియగానే ఉద్యోగం

నైపుణ్యాభివృద్ధి కేంద్రాల్లో విద్యార్థులకు మెరుగైన శిక్షణ అందనుంది. ప్రస్తుతం టాటా కంపెనీ ఆరేళ్ల వరకు కోర్సు నిర్వహణ బాధ్యత తీసుకుంది. తర్వాత గడువు పొడిగించనున్నారు. కోర్సు పూర్తి చేసిన వెంటనే అప్రెంటిస్‌షిప్ కల్పిస్తారు. కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు లభించనున్నాయి. ప్రస్తుతం కృత్రిమ మేధ(ఏఐ)కు ఆదరణ కనిపిస్తున్న నేపథ్యంలో ఐటీఐల్లో కొత్త కోర్సులను అందుబాటులోకి తెచ్చారు.

172 సీట్లకు అనుమతి

కొత్తగా ప్రవేశపెట్టిన ఆరు కోర్సులతో విద్యార్థుల్లో మెరుగైన నైపుణ్యాభివృద్ధి సాధ్యమవుతుంది. శిక్షణ పూర్తి చేస్తే కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు దొరుకుతాయి. ఆరు కోర్సుల్లో మొత్తం 172 సీట్లకు అనుమతి ఉంది.

- వెంకట్‌రెడ్డి, పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్

ఆసుపత్రిలో పార్కింగ్ పరేషాన్

న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం

ఓ వైపు ప్రధాన గేటు ముందు సంపు నిర్మాణం.. మరో వైపు క్రిటికల్ కేర్ భవనం పనులు.. ముందు వైపు ప్రధాన భవన నిర్మాణం.. వెరసి గోదావరిఖని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో పార్కింగ్ సమస్య తీవ్రమౌతుంది. అత్యవసర వేళల్లో అంబులెన్సులు సైతం ఆసుపత్రిలోకి వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. రెండు రోజుల క్రితం ఆసుపత్రి పరిశీలనకు వచ్చిన జిల్లా కలెక్టర్ ఆవరణలో వాహనాలు పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి వర్గాలను ఆదేశించారు. దీంతో ఆసుపత్రి ముందు ప్రధాన భవనం నిర్మాణం దగ్గర వాహనాలు పార్కింగ్ చేయకుండా సిబ్బంది శుక్రవారం బారికేడ్లు ఏర్పాటు చేశారు. అసలే పార్కింగ్‌కు స్థల కొరత ఉండగా ఉన్న స్థలంలో బారికేడ్లు కట్టడంతో రోగుల బంధువులు ఇబ్బంది పడుతున్నారు. వాహనాల పార్కింగ్‌ను క్రమబద్ధీకరించడం రక్షణ సిబ్బందికి తలనొప్పిగా మారింది. కొందరు రక్షణ సిబ్బందిని దుర్భాషలాడుతుండటంతో పార్కింగ్ ప్రాంతంలో పనిచేయలేమంటూ సంబంధిత ఉన్నతాధికారులకు వారు మొరపెట్టుకుంటున్నారు.

నగరపాలిక వెనకాల వాహనాల నిలుపుదల


రామగుండం నగరపాలక కార్యాలయం వెనకాలనున్న ఖాళీ ప్రదేశంలో ఆసుపత్రికి వచ్చేవారు వాహనాలను పార్కింగ్ చేసుకోవాలని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. వైద్యులు, వైద్య, వైద్యేతర సిబ్బంది వాహనాలను ఆసుపత్రి పాత భవనం వెనకాల పార్కింగ్ చేసినట్లయితే కొంత మేరకు పార్కింగ్ సమస్య తీరే అవకాశముంది. ఆటోలు,


ఆసుపత్రి ఆవరణలో అస్తవ్యస్తంగా నిలిపిన ద్విచక్రవాహనాలు

అంబులెన్సులు, కార్లు తదితర వాహనాల పార్కింగ్‌ను కాస్త దూరంగా ఏర్పాటు చేస్తూ ద్విచక్ర వాహనాలను అనుమతిస్తే కొంత మేరకు రద్దీ తగ్గుతోంది. ప్రతి వాహనదారుడు ఒక్కటే నిమిషం లోపలికి వెళ్లి వస్తానంటూ ఇష్టారీతిలో వాహనాన్ని పార్కు చేస్తుండడం.. వద్దంటే సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించడం ఆసుపత్రిలో సర్వసాధారణమైంది. ఈ విషయంలో పోలీసులు జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. ఆసుపత్రిలో పార్కింగ్ సమస్యను అర్థం చేసుకొని సహకరించాలని ప్రజలను ఆసుపత్రి వర్గాలు కోరుతున్నాయి.

రామగుండం-మణుగూరు రైల్వే లైన్ పనుల్లో కదలిక

న్యూస్‌టుడే, గోదావరిఖని



రైల్వే మార్గం రేఖా చిత్రం

భూసేకరణ ప్రక్రియకు చర్యలు

కోల్‌బెల్ట్ ప్రాంతాలను కలుపుతూ రైలు మార్గం నిర్మించాలన్న ప్రతిపాదనల్లో వేగం పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. రామగుండం నుంచి మణుగూరు వరకు రైలు మార్గం నిర్మాణానికి దశాబ్దం న్నర క్రితం ప్రతిపాదనలు చేశారు. సర్వేలు, భూసార పరీక్షలు మాత్రమే పూర్తి చేశారు. దీంతో పనుల్లో వేగం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం అధికారులతో కమిటీని నియమించింది. పనుల పర్యవేక్షణతో పాటు నిర్వహణ బాధ్యతలను అప్పగిస్తూ పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు చెందిన అధికారులతో కమిటీని నియమించింది. ఈ మేరకు రైల్వే మంత్రిత్వ శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రామగుండం-మణుగూరు రైల్వే లైన్ 207.80 కిలోమీటర్ల మేర ఉంటుంది. పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని మారుమూల ప్రాంతాల గుండా ఈ రైలు మార్గం వెళ్తుంది. సింగరేణి గనులు విస్తరించి ఉన్న ఈ ప్రాంతాల్లో విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలు కూడా ఉండటంతో రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని భావించిన రైల్వే శాఖ పట్టాల నిర్మాణాన్ని ప్రతిపాదనలకు ఎక్కించింది.

ముగ్గురు అధికారులతో కమిటీ

రెండు జిల్లాల పరిధిలోని ముగ్గురు అధికారులతో కమిటీని నియమించింది. పెద్దపల్లి జిల్లాకు చెందిన అదనపు కలెక్టర్‌తో పాటు భూపాలపల్లి జిల్లా సబ్ కలెక్టర్, ఆర్డీవోలు కమిటీలో ఉన్నారు. పెద్దపల్లి జిల్లాలోని ముత్తారం, మంథని, రామగిరి, కమాన్‌పూర్ మండలాల్లో జరిగే పనులను జిల్లా అదనపు కలెక్టర్ పర్యవేక్షిస్తారు. మల్హార్‌రావు, కాపురం, మణుగూరు ప్రాంతాలకు భూపాలపల్లి సబ్‌కలెక్టర్, ఘన్‌పూర్, భూపాలపల్లి మండలాలకు భూపాలపల్లి ఆర్డీవోలకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు.

పనుల్లో వేగానికి..


రామగుండం-మణుగూరు రైల్వే పనుల సర్వేలు ఏడాది కిందటే పూర్తి కాగా.. నాలుగు జిల్లాల కలెక్టర్లకు నివేదికలు అప్పగించారు. రైలు మార్గానికి ఎంత భూమి సేకరించాలి.. పరిహారం అంశాలపై అధికారులు కమిటీ యజమానులతో మాట్లాడి చర్యలు చేపట్టనున్నారు. ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర జరిగే మేడారం ప్రాంతం మీదుగా ఈ రైలు మార్గం వెళ్తుంది. దీంతో మారుమూల అటవీ ప్రాంతాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతోంది. సాధ్యమైనంత తొందరగా భూసేకరణ పనులు పూర్తి చేసేందుకు ఈ కమిటీని నియమించింది. భూసేకరణ ముగిసిన వెంటనే నిర్మాణం పనులు వేగంగా చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది.

కొత్త వీసీ ఎదుట సవాళ్లెన్నో!

శాతవాహన ఉపకులపతిగా ఉమేశ్‌కుమార్

ఈనాడు, కరీంనగర్

ఎట్టకేలకు శాతవాహన విశ్వవిద్యాలయానికి పూర్తి స్థాయి ఉపకులపతిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.. గతంలో ఇక్కడ రిజిస్ట్రార్‌గా పని చేసిన ఉమేశ్‌కుమార్‌కు ఈ బాధ్యతలు అప్పగించింది. శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించనుండగా.. ఆయనకు పలు సవాళ్లు స్వాగతం పలుకుతున్నాయి..





ఈ ఏడాది మే 21వ తేదీన అప్పటి ఉప కులపతిగా ప్రొఫెసర్ సంకశాల మల్లేశ్ పదవీ కాలం ముగియడంతో ఐఏఎస్ అధికారి సురేంద్ర మోహన్ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. వీసీ పోస్టు కోసం 158 మంది ఆచార్యులు దరఖాస్తు చేసుకోగా ఎట్టకేలకు ఇక్కడి విశ్వవిద్యాలయానికి పూర్తిస్థాయి వీసీగా ఉమేశ్‌కుమార్‌ను నియమిస్తూ సర్కారు ఉత్తర్వులు వెలువరించింది. 2008లో విశ్వవిద్యాలయం ఏర్పాటైనప్పటినుంచి ఇప్పటి వరకు ముగ్గురే పూర్తిస్థాయి వీసీలుగా పనిచేశారు. మొదటి ఉప కులపతిగా మహ్మద్ ఇక్బాల్ అలీ, 2012లో కడారు వీరారెడ్డి, 2021లో ఎస్.మల్లేశ్ రెగ్యులర్ వీసీలుగా కొనసాగారు.

రిజిస్ట్రార్‌గా రెండేళ్లు..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఉమేశ్‌కుమార్ రసాయన శాస్త్ర ఆచార్యుడిగా పలు చోట్ల సేవలు అందించారు. 2018- 2020 మధ్య శాతవాహన విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్‌గా పనిచేశారు. ఆ పదవికి వన్నెతెచ్చే విధంగా వ్యవహరిస్తూ విద్యార్థుల మన్ననలు అందుకున్నారు. ఆయన హయాంలోనే స్నాతకోత్సవం నిర్వహించారు. విశ్వవిద్యాలయంలో అదే మొదటి.. చివరి స్నాతకోత్సవం కావడం గమనార్హం. రహదారులు, వసతి గృహాల నిర్మాణాలు, అంబులెన్స్ ఏర్పాటు, ఏటీఎం సదుపాయాలు విద్యార్థులకు కల్పించారు. నల్గొండ మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్‌గా, ఇన్‌ఛార్జి వీసీగానూ ఈయన పనిచేశారు.

వీటిపై దృష్టి పెడితేనే..

గడిచిన కొన్నేళ్లుగా విశ్వవిద్యాలయంలో నిధుల దుర్వినియోగం, అవినీతిపై ఆరోపణలు విపరీతంగా వచ్చాయి. ఇటీవల ఇక్కడి వ్యవహారంపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు కూడా చేపట్టారు. ఒక్కో సమస్యను పరిష్కరిస్తూ, అవినీతికి ఆస్కారం లేకుండా సంస్కరణలకు, మార్పులు, చేర్పులకు శ్రీకారం చుట్టాలి. మరో వసతి గృహ భవనం నిర్మిస్తే ఇరుకిరుకుగా ఉండాల్సిన అవసరం తప్పుతుందని విద్యార్థులు పేర్కొంటున్నారు. ఇప్పటి వరకున్న సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ కోర్సులుగా మార్చడం, కొత్త పోస్టులను మంజూరు చేయించడం, ఖాళీలు లేకుండా చూడటంలాంటి చర్యలతో ముందుకు సాగాలని విద్యార్థులు కోరుకుంటున్నారు. ఇవన్నీ పక్కాగా ఉంటేనే న్యాక్ గుర్తింపు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే 12బీ హోదా ఉన్నప్పటికీ.. ఆ స్థాయిలో నిధులను రాబట్టడంపై కొత్త వీసీ దృష్టి పెట్టాలి. మారుతున్న కాలంతోపాటు కొత్త కోర్సుల ఆవశ్యకతను గుర్తించి విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తుని అందించాలి.

బకాయిల విడుదలకు డిమాండ్


రాజీవ్ రహదారిపై ధర్నా చేస్తున్న విద్యార్థులు, ఏబీవీపీ నాయకులు

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం పెద్దపల్లి రాజీవ్ రహదారిపై ధర్నా నిర్వహించారు. భారీగా తరలివచ్చిన విద్యార్థులు నినాదాలు చేశారు. సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాకేశ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రూ.7,800 కోట్ల బకాయిలు పేరుకుపోయాయని ఆరోపించారు. ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్ ఇస్తామని కళాశాలల యాజమాన్యాలు మెలికలు పెడుతుండటంతో పేద విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారన్నారు. జిల్లా కన్వీనర్ రాజశేఖర్, ప్రవీణ్, సాయితేజ, అజయ్, ఓమేష్, రిషి పాల్గొన్నారు.

ప్రధాన మార్గం.. ప్రమాద భయం

సుల్తానాబాద్ నుంచి ఓదెల, కాల్వశ్రీరాంపూర్‌లకు వెళ్లే మార్గంలో సుద్దాల వద్ద ఎస్సారెస్పీ డీ 86 ప్రధాన కాలువ వంతెన రక్షణ గోడలు కూలిపోయాయి. ఆర్టీసీ, పాఠశాల బస్సులు, ప్రైవేటు వాహనాలు నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రమాదం జరగకముందే చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. సుల్తానాబాద్ సర్కిల్ పరిధిలోని పలు వంతెనల మరమ్మతుకు ప్రభుత్వానికి నివేదించినట్లు ఎస్సారెస్పీ డీఈ మధుమతి తెలిపారు. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతామన్నారు. **- న్యూస్‌టుడే, సుల్తానాబాద్**



జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా అన్నయ్యగౌడ్



సుల్తానాబాద్, న్యూస్‌టుడే: జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా సుల్తానాబాద్ పట్టణానికి చెందిన అంతటి అన్నయ్యగౌడ్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి బి.వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాలపై ఆసక్తితో ఎన్‌ఎస్‌యూఐలో చేరిన అన్నయ్యగౌడ్ కొంతకాలం యువజన కాంగ్రెస్‌లో పని చేశారు. కాంగ్రెస్‌లో చేరి క్రియాశీలకంగా పని చేశారు. నాటి ఎమ్మెల్యే ముకుందరెడ్డి హయాంలో ముఖ్యమంత్రి వైఎస్‌కు సన్నిహితుడిగా వ్యవహరించారు. 2011 నుంచి 2016 వరకు సుల్తానాబాద్ సర్పంచిగా, ఉమ్మడి జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా పని చేశారు. సుదీర్ఘ కాలం పార్టీకి విధేయుడుగా ఉండటం, మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే విజయరమణారావుకు ప్రధాన అనుచరుడిగా ఉండటం కలిసివచ్చిందని భావిస్తున్నారు.


వానొస్తే బురద.. రాకపోకలకు వ్యథ

లాలపల్లి రహదారి నిర్మాణానికి ఏళ్లుగా నిరీక్షణ

గ్రామం: లాలపల్లి

జనాభా: 2,080

సమస్య: పక్కా రహదారి నిర్మాణం లేక పోవడం.



గతంలో జరిగిన ప్రయత్నాలు: గడిచిన పదేళ్లలో స్థానికులకు ఇస్తున్న హామీల అమలులో పాలకులు విఫలమయ్యారు.

ప్రస్తుత పరిస్థితి: ప్రతిపాదనలు కాగితాలకే పరిమితం కావడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

నిర్మిస్తే ప్రయోజనం పొందే గ్రామాలు: ఎలిగేడు, వెదురుగట్టు, చీమలపేట, తెలుకుంట, జూలపల్లి, ధూళికట్ట తదితర గ్రామాలతో పాటు జూలపల్లి, ఎలిగేడు మండలాలను అనుసంధానించే మార్గమవుతుంది.


బురదగా మారిన లాలపల్లి మట్టి రోడ్డు

న్యూస్‌టుడే, పెద్దపల్లి

లాలపల్లి గ్రామం చిన్నదే అయినా రహదారి నిర్మాణంతో జూలపల్లి, ఎలిగేడు మండలాలను అనుసంధానించడానికి ఇదే సరైన మార్గం. వానాకాలంలో మట్టి రోడ్డు బురదగా మారుతుండడంతో ఎలిగేడు నుంచి ధూళికట్ట రోడ్డు మార్గంలో జూలపల్లికి తిరిగి వెళ్లాల్సి వస్తోంది. ఆ మార్గంలో దూర భారం పెరగడంతో పాటు మార్గమధ్యంలో ఇతర గ్రామాలకు ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతోంది. గతంలో చొప్పదండి మండలం వెదురుగట్టు నుంచి జూలపల్లి రహదారి నిర్మాణానికి పెద్దపల్లి, చొప్పదండి ఎమ్మెల్యేలు యత్నించారు. ఆ రోడ్డు కూడా లాలపల్లి మీదుగా వెదురుగట్టు నుంచి ఎలిగేడు వరకు వెళ్లింది. అక్కడి నుంచి జూలపల్లి వైపు అడుగులు పడలేదు. దీంతో గ్రామంలోని బురద రోడ్డుకు మోక్షం లభించలేదు.

చాలా గ్రామాలకు ప్రయోజనం

రహదారి నిర్మాణంతో లాలపల్లి గ్రామస్థుల కంటే మండల ప్రజలకే ఎక్కువ ప్రయోజనం కలుగుతుంది. కరీంనగర్, సుల్తానాబాద్‌ల నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రైవేటు వాహనాలు ఎలిగేడు నుంచి లాలపల్లి మీదుగా జూలపల్లి వెళ్తే చీమలపేట తేలుకుంట, పెద్దాపూర్, జూలపల్లి గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగవుతాయి. ధూళికట్ట రోడ్డుతో పోలిస్తే ఈ మార్గంలో 3 కిలోమీటర్లు తగ్గుతుంది. దీనికి తోడు లాలపల్లి వాసులకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది. ఎలిగేడు మండలకేంద్రం ద్వారా రవాణా సౌకర్యాల విస్తరణకు అవకాశాలు పెరుగుతాయి. ఎలిగేడు నుంచి సుల్తాన్‌పూర్ మీదుగా కరీంనగర్‌కు, వెదురుగట్టు మీదుగా చొప్పదండికి ఆర్టీసీ బస్సులు నడిపేందుకు అవకాశం ఉంటుంది.

నెలాఖరులోగా ప్రారంభిస్తాం

ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించే విషయంలో వెనకడుగు వేయబోం. ఈ ఏడాది వర్షాకాలంలో రోడ్డు బురదమయంగా మారడంతో లాలపల్లి వెళ్లే ఆర్టీసీ బస్సులు రద్దయ్యాయి. స్థానికులు దాదాపు 3 కిలోమీటర్ల దూరం కాలినడకన వెళ్తుండటంపై 'ఈనాడు'లో ప్రచురితమైన కథనంతో రహదారి నిర్మాణానికి నిధుల కోసం చేసిన యత్నాలు ఫలించాయి. ఈ నెలాఖరులోగా రోడ్డు పనులు ప్రారంభిస్తాం.

- విజయరమణారావు, ఎమ్మెల్యే

భూ సేకరణపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో భూ సేకరణ ప్రక్రియ పూర్తి చేసేందుకు అధికారులు దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ లాల్ సూచించారు. శుక్రవారం ఆయన సమీకృత పాలనా ప్రాంగణంలో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఆర్జీ 1, 2, 3 పరిధిలోని భూములను సేకరించాలన్నారు. రామగిరి మండలం బుధవారంపేటలో 88.20 ఎకరాలు, పెద్దంపేటలో 1.12 ఎకరాల భూ సేకరణ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఆర్జీ-2 జీఎం సునీత, ఆర్జీ-3 మేనేజర్ నారాయణ, తహసీల్దార్లు పాల్గొన్నారు.

వలస జీవుల ఆరోగ్యంతో వైద్య కేంద్రాల చెలగాటం

- ఏజెంట్లు, ల్యాబ్ నిర్వాహకుల దందా
- టీకాలు వికటించి ఆసుపత్రి పాలవుతున్న వైనం

ఈనాడు, సిరిసిల్ల

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నెలకు సగటున 300 నుంచి 500 మంది ఇతర దేశాలకు వలస వెళ్తుంటారు. ఎలాంటి రుగ్మతలు లేకుంటేనే ఆయా దేశాలు వీసాలు మంజూరు చేస్తాయి. దీర్ఘకాలిక వ్యాధులు లేవని నిర్ధారించుకోవడంతోపాటు ఆయా దేశాలు సూచించిన టీకాలు తీసుకోవాలి. వీటిని ధ్రువీకరించాక వీసా మంజూరవుతుంది. హైదరాబాద్ నారాయణగూడలోని ప్రభుత్వ ఐపీఎం (ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్), జీఏఎంసీఏ (గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ అప్రూవ్ మెడికల్ సెంటర్స్ అసోసియేషన్) కేంద్రాల్లో వైద్య పరీక్షలు, టీకాలు ఇస్తారు. ఐపీఎంలో రూ.30 చెల్లించి తమ వివరాలతో స్లాట్ బుక్ చేసుకోవాలి. అందులో సూచించిన సమయానికి వెళ్తే ఉచితంగా టీకా ఇస్తారు. ఇక్కడ 26 రకాల టీకాలు అందుబాటులో ఉంటాయి. ఇక జీఏఎంసీఏలో ఒక్కరికి రూ.7,500 ఫీజు చెల్లించాలి.

✦ దుబాయ్, సౌదీ, ఒమన్, కువైట్, సింగపూర్, మలేషియా, ఆఫ్ఘానిస్థాన్ తదితర దేశాలకు వెళ్లేవారు వైద్య పరీక్షలు, టీకాలపై అవగాహన లేక పూర్తిగా ఏజెంట్లను నమ్ముతారు. వారు అడిగినంత ఇచ్చి మోసపోతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతి నెలా కనీసం వెయ్యి మంది వరకు వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. ఈ లెక్కన నెలలో లక్షల రూపాయలు వైద్య పరీక్షల పేరిట వ్యాపారం జరుగుతోంది. వాస్తవంగా ఈ తరహా వైద్య పరీక్షలన్నీ ప్రభుత్వ ఐపీఎం కేంద్రంలో రూ.30 స్లాట్‌తో అయిపోతాయి. వీటిపై అవగాహన లేని వలస జీవులు వేలాది రూపాయలు నష్టపోతున్నారు.



✦ హైదరాబాద్‌లోని ఐపీఎంతోపాటు జీఏఎంసీఏ అనుమతి ఉన్నవి ఎనిమిది కేంద్రాలు ఉన్నాయి. అనుమతి లేని మెహదీపట్నం, హిమాయత్‌నగర్, చార్మినార్, పాతబస్తీ ప్రాంతాల్లో చాలా ఉన్నాయి. ఈ కేంద్రాల్లో టీకాలు ఇచ్చేవారి చేతులు, సూది మందు ఇచ్చే ప్రాంతంలో చర్మాన్ని శుభ్రం చేయాలి. చర్మం పొరలోనే సూది మందు ఇవ్వాలి. కాని అపరిశుభ్రతతో చొక్కా పైనుంచి సూది ఇవ్వడం, అదీ చర్మం లోపలికి వేయడంతో కొన్ని రోజులకు సూది వేసిన చోట ఇన్‌ఫెక్షన్ ఏర్పడుతుంది. ఉమ్మడి జిల్లాలో జగిత్యాల, వేములవాడ, కరీంనగర్‌లలో ఇన్‌ఫెక్షన్లతో బాధపడుతున్న వారు రోజు రోజుకు పెరుగుతున్నారు.

డబ్బులు ఖర్చయ్యాయి.. ఉపాధికి దూరమయ్యా..

- కారెంగుల రంజిత్‌కుమార్, సంగెం, కోరుట్ల మండలం



నేను కోరుట్లలో టైల్స్ నిర్మాణంలో పని చేస్తున్నాను. బహ్రెయిన్ వెళ్లేందుకు మెట్‌పల్లిలోని ఏజెంటుకు వీసా కోసం రూ.40 వేలు, వైద్య పరీక్షలకు రూ.7,200 చెల్లించాను. హైదరాబాద్ మెహదీపట్నంలోని ఎస్‌కే మెడికల్స్‌లో జూన్ 28న వెళ్లి వైద్య పరీక్షలు, టీకా చేయించుకున్నాను. పదిహేను రోజులకు టీకా వేసిన ప్రాంతంలో వాపుతోపాటు నొప్పి ఎక్కువైంది. స్థానిక వైద్యులను సంప్రదిస్తే, పరీక్షలు చేసి టీకా వికటించిందని శస్త్రచికిత్స చేశారు. పది రోజులకు తిరిగి నొప్పి రావడంతో రెండోసారి శస్త్రచికిత్స చేశారు. ఇప్పటికీ రూ.30 వేల పైనే ఖర్చయింది. వీసా వచ్చినా గడువు ముగియడంతో వెళ్లలేకపోయాను. టీకా ఇచ్చిన కేంద్రంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాను.

కంపెనీకి డబ్బులు చెల్లించి ఇంటికి వచ్చా

- పోతుగంటి చంద్రశేఖర్, సంగెం, కోరుట్ల మండలం




ఆరు నెలల క్రితం ముంబయి ఏజెంటు సాయంతో క్లీనింగ్ సూపర్‌వైజర్ పని మీద సౌదీ వెళ్లాను. అక్కడికి వెళ్లిన రెండు నెలలకు టీకా తీసుకున్న ప్రాంతంలో నొప్పి రావడంతో అక్కడి వైద్యులను సంప్రదించాను. టీకా వికటించింది సర్జరీ చేయాలని సూచించారు. కంపెనీ వారు వేతనం ఇవ్వలేదు. నా దగ్గర చికిత్సకు డబ్బులు లేవు. కంపెనీకి అదనపు డబ్బులు చెల్లించి వచ్చాను. ఇప్పటికీ రెండు శస్త్రచికిత్సలు అయ్యాయి. మొత్తంగా రూ.4 లక్షలు ఖర్చయ్యాయి. ప్రాణాలతో చెలగాటమాడుతున్న టీకా కేంద్రంపై చర్యలు తీసుకోవాలి.

పత్తి విక్రయాలకు సాంకేతిక దన్ను

న్యూస్‌టుడే, జమ్మికుంట

మద్దతు ధరకు పత్తి విక్రయించడంలో రైతులు ఇబ్బందులు పడకుండా మార్కెటింగ్ శాఖ సమాచారాన్ని అందించేందుకు సాంకేతికను అందుబాటులోకి తీసుకొచ్చింది. వాట్సాప్ అప్లికేషన్‌తో ప్రభుత్వ రంగ సంస్థ సీసీఐ కొనుగోలు విధానాన్ని ఎప్పటికప్పుడు తెలియజేసేలా చర్యలు తీసుకుంది. దీంతో సీసీఐ కేంద్రానికి వచ్చిన సమయం, పత్తి ఖరీదు, డబ్బుల చెల్లింపు ఏ స్థాయిలో ఉందనే సమాచారం తెలియనుంది. మార్కెటింగ్ శాఖ తాజా చర్యతో రైతులు సీసీఐ కేంద్రాలున్న జిన్నింగ్ మిల్లుల్లో విక్రయానికి నిరీక్షించే అవసరం ఉండదు. ఏ కేంద్రంలో ఎంత పత్తి ఉంది? అక్కడ పత్తిని విక్రయించేందుకు ఎంత సమయం పడుతుందనే వివరాలను రైతులు ముందస్తుగా తెలుసుకునే అవకాశం కలుగుతుంది. సీసీఐకి పత్తిని విక్రయించే రైతులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశామని.. రైతులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ జేడీఎం ఉప్పుల శ్రీనివాస్ తెలిపారు.



వాట్సాప్‌లో పత్తి రైతుకు కనిపించే వివరాలు

రైతులు ఏం చేయాలంటే..

✦ సీసీఐకి పత్తి విక్రయానికి సంబంధించిన సెల్ నంబర్ 8897 281111ను సేవ్ చేసుకోవాలి.

✦ ఆ నంబర్ వాట్సాప్‌లో 'హెచ్‌ఐ' అని టైపు చేయాలి.

✦ వెంటనే 'వన్ సాఫ్ట్ సిస్టమ్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో యాప్ ఓపెన్ అవుతుంది.

✦ ఇంగ్లిష్, తెలుగు, హిందీ భాషలు కనిపిస్తాయి.

✦ కావాల్సిన భాషను ఎంపిక చేసుకోవాలి.

✦ భాషను ఎంపిక చేసుకోగానే పత్తి విక్రయ సమాచారం, తక్‌పట్టి వివరాలు, కొనుగోలు కేంద్రంలో వేచి ఉండే సమయం వంటి వివరాలు కనిపిస్తాయి.

✦ పత్తి విక్రయానికి సంబంధించి రైతు వివరాలు.. ఎన్ని ఎకరాల్లో సాగు చేశారు.. ఎన్ని క్వింటాళ్ల పత్తిని సీసీఐ కొనుగోలు చేయగలదు వంటి వివరాలు తెలుస్తాయి.





పసిడి భానుడు.. వెన్నెల రేడు

నీలి మేఘాల మధ్య నుంచి భానుడి లేలేత కిరణాలతో పచ్చటి పంటలు పసిడి వర్ణాన్ని అద్దుకోగా చుట్టూ ఆకాశం ఎరుపు రంగులో తళుకులీనుతోంది. నీకు నేను పోటీ అంటూ పున్నమి చంద్రుడు ఎదురుగా వెన్నెల కాంతులు కురిపించాడు. శుక్రవారం తెల్లవారుజామున కమాన్‌పూర్ మండలం గుండారం పంచాయతీ రాజాపూర్ వద్ద పంట పొలాల్లో ఈ దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి.

-న్యూస్‌టుడే, కమాన్‌పూర్

చోటు కోసం పోటాపోటీ!

- పల్లెల్లో 'ఇందిరమ్మ కమిటీ'ల కలవరం

ఈనాడు, కరీంనగర్

స్థానిక సంస్థల ఎన్నికల విషయం పక్కకు వెళ్లి.. ప్రస్తుతం పల్లెల్లో ఇందిరమ్మ కమిటీల్లో చోటు కోసం చర్చ జరుగుతోంది. 'నాకంటే.. నాకు' అవకాశమివ్వాలన్న విజ్ఞప్తులు పెరుగుతుండటంతో అధికార పార్టీ నాయకులకూ తలనొప్పి వ్యవహారంగా మారింది. నాలుగు జిల్లాల పరిధిలో ఊరూరా కమిటీలు ఏర్పాటు చేసేందుకు అవసరమైన ప్రక్రియ దాదాపుగా పూర్తయింది. అన్ని జిల్లాల కలెక్టర్ల చేతికి చేరిన ఈ ప్రతిపాదనలను ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదించిన తరువాత అధికారికంగా ప్రకటిస్తారు. కానీ చాలా గ్రామాల్లో ఇందులో చోటు దక్కించుకునేందుకు చోటామోటా నాయకులు ఎవరికి వారుగా ప్రయత్నాలు చేశారు. కొన్ని చోట్ల ఏకాభిప్రాయాలతో సభ్యుల పేర్లు వెళ్లినప్పటికీ ఇంకొన్ని చోట్ల మాత్రం సీనియర్లు, జూనియర్లనే తారతమ్యంతో రెండు, మూడు జాబితాలు ఉన్నతాధికారులకు అందాయి.

ఆగమేఘాల మీద.. ఈ నెల 11వ తేదీన ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని రోడ్లు, భవనాల శాఖ కార్యదర్శి బుద్ధ ప్రకాశ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 19 నాటికి ఎంపిక పూర్తి చేయాల్సి ఉండటంతో క్షేత్రస్థాయిలో కసరత్తు జరిగింది. ఇందిరమ్మ ఇళ్ల కోసం గతంలో భారీగా దరఖాస్తులు వచ్చాయి. ప్రజాపాలనలోనూ ఉమ్మడి జిల్లాలో 7,18,756 మంది అర్జీలు అందించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గానికి 3,500 చొప్పున 12 నియోజకవర్గాలకు 42 వేలు మంజూరు చేసింది. సొంత స్థలం ఉన్న వారికి రూ.5 లక్షలిచ్చి ఇందిరమ్మ ఇళ్లను నిర్మించనున్నారు.

ఏడుగురికి అవకాశం!

ఇందిరమ్మ కమిటీ ఛైర్మన్‌గా గ్రామ సర్పంచి, కన్వీనర్‌గా పంచాయతీ కార్యదర్శి వ్యవహరిస్తారు. ప్రత్యేకాధికారుల పాలన ఉండటంతో ప్రస్తుతం ఛైర్మన్‌గా ప్రత్యేకాధికారి ఉంటారు. పుర, నగరపాలికల్లో కౌన్సిలర్ లేదా కార్పొరేటర్ ఛైర్మన్‌గా ఉండనున్నారు. కన్వీనర్‌గా వార్డు అధికారికి చోటిస్తారు. వీరు కాకుండా కమిటీలో మరో అయిదుగురు స్థానికుల్ని తీసుకుంటారు. ఇందులో ఇద్దరు మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులతోపాటు గ్రామాభివృద్ధిపై ఆసక్తి ఉన్న మరో ముగ్గురితో కమిటీని ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు సూచించారు. ఆ ముగ్గురిలో ఒకరు బీసీ మరొకరు ఎస్సీ లేదా ఎస్టీ సామాజిక వర్గాల నుంచి తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటంతో చాలా గ్రామాల్లో ఈ పార్టీకి చెందిన వారే ఈ కమిటీల్లో చోటు కోసం పోటీపడ్డారు. ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికలో కమిటీలది కీలకపాత్ర కావడం, తరువాత పథకంలో లోపాలేమైనా ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తూ లబ్ధిదారులకు అధికారులకు మధ్య సంధానకర్తలుగా వ్యవహరించే అవకాశం కావడంతో చాలా మంది ఉత్సాహం చూపుతున్నారు.

వివాదం తప్పదా!

ఎంపికకు ముందే అటు కాంగ్రెస్ ఇటు భారాస నాయకుల మధ్య అక్కడక్కడా వివాదం మొదలైంది. హుజూరాబాద్‌లో భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తన నియోజకవర్గ పరిధిలోని చాలా గ్రామాల నుంచి ఈ కమిటీల్లో పలువురికి చోటివ్వాలని ప్రతిపాదనలు ఎంపీడీవోలకు అందించారు. భారాస ఎమ్మెల్యేలున్న కరీంనగర్, కోరుట్ల, సిరిసిల్ల నియోజకవర్గాల్లో ఇదే తరహాలో ప్రతిపాదనలు పలు కమిటీల విషయంలో అందాయి. ముఖ్యంగా పురపాలిక, నగరపాలక సంస్థల్లో భారాస కార్పొరేటర్లు ఎక్కువగా ఉన్నారు. వారు పేర్లు ఇస్తుండగా అటు కాంగ్రెస్ వారు కూడా పోటీగా మరో ప్రతిపాదనను ఇస్తుండటంతో ఏది తుది జాబితాగా మార్చాలనే సందిగ్ధంలో అధికారులుంటున్నారు. ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదం తరువాత అసలు కమిటీల్లో ఎవరుంటారనేది తేలనుంది.

23 నుంచి 26 వరకు డీఈఈసెట్ వెబ్ ఆప్షన్లు

తిమ్మాపూర్, న్యూస్‌టుడే: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (డీఈఈసెట్)-2024 ఉత్తీర్ణులై, ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిన అభ్యర్థులు డీ.ఎల్.ఎడ్./డీపీఎస్ఈ మొదటి సంవత్సరంలో చేరడానికి ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలని ఎల్ఎండీ కాలనీ డైట్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీరాం మొండయ్య తెలిపారు. ఇప్పటి వరకు ధ్రువపత్రాల పరిశీలన చేయించుకోలేకపోయిన ఉమ్మడి జిల్లా అభ్యర్థులు ఈ నెల 21న తిమ్మాపూర్ మండలంలోని ఎల్ఎండీ కాలనీలోని డైట్ కళాశాలలో పరిశీలన చేయించుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు డీఈఈసెట్ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పెరిగిన పత్తి విక్రయాలు

జమ్మికుంట, న్యూస్‌టుడే: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో పత్తి విక్రయాలు పెరుగుతున్నాయి. యార్డుకు శుక్రవారం 174 ట్రాలీల కొత్త విడిపత్తిని రైతులు విక్రయానికి తీసుకొచ్చారు. సీజన్ ఆరంభం నుంచి ఎక్కువ పత్తి విక్రయానికి రావటం ఇదే ప్రథమని మార్కెటింగ్ శాఖ అధికారులు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఇతర మార్కెట్లలో పత్తి విక్రయాలు మొదలు కాలేదు. జమ్మికుంట మార్కెట్‌లో గత నెల 18 నుంచి కొత్తపత్తిని రైతులు విక్రయానికి తీసుకొస్తున్నారు. శుక్రవారం ట్రాలీల వారీగా బిడ్డింగ్ నిర్వహించారు. కొత్త విడిపత్తికి కనిష్ఠంగా రూ.6,000 నుంచి రూ.7,000 వరకు ధర పలికింది. 38 క్వింటాళ్ల బస్తాల పత్తి విక్రయానికి రాగా క్వింటాకు రూ.6,000 నుంచి రూ.6,500 వరకు వ్యాపారులు ఖరీదు చేశారు. గురువారం కంటే తాజాగా ధర రూ.50 తగ్గింది. స్థానిక ద్వితీయ శ్రేణి వ్యాపారులతోపాటు ఇద్దరు జిన్నింగ్ మిల్లుల వ్యాపారులు పత్తిని ఖరీదు చేయగా.. బిడ్డింగ్‌ను మార్కెట్ కార్యదర్శులు ఆర్.మల్లేశం, రాజాలు పరిశీలించారు.

స్వయం ఉపాధికి చేయూత

ఎస్‌బీఐ ఆర్‌సెటిలో కంప్యూటర్ ట్యాలీపై ఉచిత శిక్షణ

న్యూస్‌టుడే, తిమ్మాపూర్

గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగులకు ఎస్‌బీఐ ఆర్‌సెటి అండగా నిలుస్తోంది. అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించడంతోపాటు వ్యాపార సాధన నైపుణ్యాలను పెంపొందిస్తూ వారి భవిష్యత్తుకు బాటలు వేస్తోంది. ఈ ఉచిత శిక్షణ ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగులకు లబ్ధి చేకూరనుంది.

30 రోజులపాటు..

- కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని మహాత్మానగర్‌లో 2010 సంవత్సరంలో నెలకొల్పిన ఎస్‌బీఐ ఆర్‌సెటి (గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ)లో ఈ నెల 23 నుంచి కంప్యూటర్ ట్యాలీ కోర్సుపై 30 రోజుల ఉచిత శిక్షణ ప్రారంభమవుతుంది.
- ఆసక్తి గల ఉమ్మడి జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంతాల (18 నుంచి 45 ఏళ్ల వయసు కలిగిన) పురుషులు ఎస్సెస్సీ మెమో, ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్, 3 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్‌లతో ఈ నెల 22వ తేదీ లోపు సంస్థలో సంప్రదించాలి.
- కంప్యూటర్ ట్యాలీ కోర్సుకు 30 రోజుల వరకు శిక్షణ తరగతులు ఉంటాయి.
- శిక్షణ కాలంలో ఉచిత భోజనంతోపాటు ఉచిత వసతిని అందిస్తారు.



మహాత్మానగర్‌లోని ఎస్‌బీఐ ఆర్‌సెటి సంస్థ

యువత సద్వినియోగం చేసుకోవాలి

- డి.సంపత్, సంస్థ డైరెక్టర్

సంస్థ ద్వారా నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ అందించడంతోపాటు నైపుణ్యాలను మెరుగుపర్చేలా కృషి చేస్తున్నాం. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలి. శిక్షణ అనంతరం ధ్రువపత్రాన్ని అందజేయడంతోపాటు వ్యాపార రంగానికి సంబంధించిన రుణాన్ని బ్యాంకు ద్వారా అందజేస్తున్నాం.

వరద కాలువకు నీటి విడుదల

జగిత్యాల ధరూర్‌క్యాంపు, న్యూస్‌టుడే: శ్రీరామసాగర్ జలాశయం నుంచి వరదకాలువకు శుక్రవారం 5 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా ఈ నీటిని మధ్యమానేరు జలాశయానికి తరలించనున్నారు. ప్రాజెక్టులోకి 23,826 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా స్పిల్‌వే గేట్లద్వారా 6,248 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 2,200 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. కాకతీయ కాలువకు 5,800, ఇతర కాలువలు, మిషన్ భగీరథ, ఎత్తిపోతలు కలుపుకుని మొత్తం ఇన్‌ఫ్లోకు సమానంగా ఔట్‌ఫ్లోను కొనసాగిస్తూ ప్రాజెక్టులో గరిష్ఠస్థాయిలో 80.501 టీఎంసీల నీటిని నిల్వచేస్తున్నారు.



హెడ్‌రెగ్యులేటర్ నుంచి వరదకాలువకు విడుదలవుతున్న నీరు

తేలికపాటి వర్షసూచన.. ఉమ్మడి జిల్లాలో రాగల అయిదురోజుల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షసూచన ఉన్నట్లు పొలాస పరిశోధనస్థానం ఏడీఆర్ డాక్టర్ జి.శ్రీనివాస్ తెలిపారు. వర్షసూచన ఉన్నందున రైతులు తమ పంట ఉత్పత్తులను కాపాడుకోవాలన్నారు. ఉష్ణోగ్రతలు కనిష్ఠంగా 23-24 డిగ్రీలు, గరిష్ఠంగా 32 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదవుతాయని వివరించారు.

వ్యవసాయ, ఉద్యాన వర్సిటీ వీసీల నియామకంపై హర్షం

జగిత్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీగా డాక్టర్ అల్దాస్ జానయ్య, కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీగా డాక్టర్ దండ రాజిరెడ్డిలను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. పెద్దపల్లి జిల్లాకు చెందిన దండ రాజిరెడ్డి గతంలో జగిత్యాల పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనస్థానంలో శాస్త్రవేత్తగా పనిచేయగా అల్దాస్ జానయ్య జగిత్యాల పొలాస వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్‌గా పనిచేశారు. ఉమ్మడి జిల్లాతో అనుబంధంగల ఇద్దరు వ్యక్తులు రెండు వర్సిటీలకు వీసీలుగా నియమితులు కావటంపై సాగురంగానికి మేలు కలిగిస్తుందని ఏడీఆర్ డాక్టర్ జి.శ్రీనివాస్, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ భారతిభట్, డాక్టర్ మంజులత, డాక్టర్ శ్రీధర్‌సిద్ధి, వెల్మల రాంరెడ్డి, వంగల వెంకటరెడ్డి పేర్కొన్నారు.

చిన్నారులకూ ఏకరూప దుస్తులు

అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీకి సిద్ధం

న్యూస్‌టుడే, కరీంనగర్ కలెక్టరేట్

పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేసే ఏకరూప దుస్తులను ఇక నుంచి అంగన్‌వాడీ పిల్లలకూ అందివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. చిట్టి, పొట్టి చిన్నారులు ఇక నుంచి ఏకరూప దుస్తుల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో సందడి చేయనున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల తరహాలో అంగన్‌వాడీ చిన్నారులు కనిపించనున్నారు. ప్రభుత్వం వస్త్రాన్ని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా శిశు వికాస కేంద్రాలకు అందజేసింది. ఈ వస్త్రంతో మహిళా సంఘ సభ్యులు ఏకరూప దుస్తులు కుట్టడం పూర్తి చేశారు. కొన్ని రోజుల్లో చిన్నారులకు అందజేస్తారు.

ఉమ్మడి జిల్లాలో వివరాలు ఇలా..

జిల్లా	అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
జగిత్యాల	1065	63,835
కరీంనగర్	777	43,736
సిరిసిల్ల	587	34,376
పెద్దపల్లి	706	35,112

మూడు నుంచి ఆరేళ్ల పిల్లలకు.. చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించటంతోపాటు ఆటపాటలతో ప్రాథమిక విద్య నేర్పించటానికే మూడు దశాబ్దాల క్రితం అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పడ్డాయి. ఇప్పటివరకు చిన్నారులు వివిధ రకాల దుస్తులు ధరించి అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చేవారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వారికి ఏకరూప దుస్తులు పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఇక నుంచి వారు ఏకరూప దుస్తులు ధరించి అంగన్‌వాడీలకు రావాల్సి ఉంటుంది. బాలురకు చొక్కా, నెక్కరు, బాలికలకు గౌను ఆకర్షణీయంగా డిజైన్ చేయటంతో అదే తరహాల్లో దర్జీలు కుడుతున్నారు. ఒక్కో జత కుట్టేందుకు రూ.80 నుంచి రూ.100 వరకు ప్రభుత్వం వారికి చెల్లిస్తుంది. దర్జీ పనులు ఇప్పటి వరకు 99 శాతం పూర్తయ్యాయి. జిల్లా ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు పంపిణీ చేయనున్నారు.



చిన్నారుల దుస్తుల నమూనా

మంచి డిజైన్లతో కుట్టాం

మాకు అప్పగించిన వస్త్రాలను చిన్నారుల కొలతలకు తగినట్లుగా, వివిధ రకాల డిజైన్లతో షర్టులు, నెక్కర్లు, గౌన్లు కుట్టాం. నాణ్యత ప్రమాణాలు పాటించాం. మాకు అప్పగించిన వస్త్రాన్ని మొత్తం కుట్టడం పూర్తి చేసి సంబంధిత శాఖకు అప్పగించాం.

- దీప్తి, స్వచ్ఛంద సంస్థ సభ్యురాలు, కరీంనగర్

త్వరలోనే పంపిణీ

చిన్నారులకు ఏకరూప దుస్తులు కుట్టడం పూర్తయింది. త్వరలోనే కలెక్టర్, ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా వాటిని పంపిణీ చేయనున్నాం. దుస్తుల పంపిణీతో కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య సైతం పెరుగుతుందని ఆశిస్తున్నాం. మొదట 3 ఏళ్ల నుంచి 6 ఏళ్ల వయసుగల చిన్నారులకు పంపిణీ చేయనున్నాం.

- సరస్వతి, జిల్లా సంక్షేమాధికారి, కరీంనగర్

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 4 PM)
గోదావరిఖని : 80085 73573
పెద్దపల్లి : 80085 73542
మంథని : 99122 68471

న్యూస్‌టుడే, కల్వశ్రీరాంపూర్

? కల్వశ్రీరాంపూర్ మండలం చిన్నరాతుపల్లిలో ప్రధాన రహదారిపై మలుపు వద్ద విద్యుత్తు స్తంభం ఉండటంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. -రాజేష్, గ్రామస్థుడు

✔ గ్రామంలో ప్రధాన రహదారిపై ఉన్న స్తంభాన్ని పరిశీలించి తొలగించేలా చర్యలు తీసుకుంటాం. -విద్యుత్తు శాఖ ఏఈ శ్రీనివాస్

ధరణి సమస్యలను పరిష్కరించాలి

ఎలిగేడు(సుల్తానాబాద్), న్యూస్‌టుడే: ధరణి పెండింగ్ సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ సూచించారు. శుక్రవారం ఆయన ఎలిగేడు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసి, ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిశీలించారు. వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం మీసేవా కేంద్రాల వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. తహసీల్దార్ బషీరుద్దీన్, నాయబ్ తహసీల్దార్ కిరణ్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఉన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

అంతర్గాం ఠాణా సందర్శించిన ఏసీపీ

పాలకుర్తి(అంతర్గాం), న్యూస్‌టుడే: అంతర్గాం పోలీసు స్టేషన్‌ను గోదావరిఖని ఏసీపీ రమేష్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. పలు రికార్డులను పరిశీలించి కేసులకు సంబంధించి తగు సూచనలు చేశారు. కేసులు త్వరగా పరిష్కారమయ్యే విధంగా చూడాలన్నారు. రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై వెంకటస్వామి పాల్గొన్నారు.


ఠాణాలో రికార్డులను పరిశీలిస్తున్న ఏసీపీ రమేష్

ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై విస్తృత ప్రచారం

మంథని, న్యూస్‌టుడే: పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన అర్హులు నవంబరు 6లోగా ఓటర్లుగా నమోదు చేసుకునేలా విస్తృత ప్రచారం చేయాలని మంథని ఆర్డీవో కార్యాలయ ఏవో రవీందర్ సూచించారు. శుక్రవారం ఆయన అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ గతంలో ఓటరు జాబితాలో పేర్లున్న వారు కూడా తప్పనిసరిగా కొత్తగా నమోదు చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు ఫారం 19, పట్టభద్రులు ఫారం 18 ప్రకారం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ మేరకు డిగ్రీ కళాశాలలో ప్రైవేట్, ప్రభుత్వ విద్యాసంస్థల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. భారాస, కాంగ్రెస్ పార్టీల ప్రతినిధులు లక్ష్మణ్, శశిభూషణ్‌కాచే, పది మండలాల తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

జూలపల్లి, న్యూస్‌టుడే: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం షీ టీం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళల భద్రత, ఆన్‌లైన్ మోసాలు, డ్రగ్స్ నిర్మూలనపై షీ టీం ఇన్‌ఛార్జి, ఏఎస్సై మల్లన్న వివరించారు. మహిళలు, విద్యార్థినులు ఎవరైనా వేధింపులకు గురి చేస్తే 1930, 630392700, 100 హెల్ప్‌లైన్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. బృందం సభ్యులు సురేష్, స్నేహలత, ఆశ్రిత, ఆస్మా, మాధవి, ప్రిన్సిపల్ విశ్వప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లి మందలించిందని యువకుడి ఆత్మహత్య

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: మద్యం తాగొద్దని తల్లి మందలించిందని మనస్తాపంతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సుల్తానాబాద్ మండలం కొదురుపాకలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రావణ్‌కుమార్, మృతుని కుటుంబ సభ్యుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన దుగ్యాల జితేందర్ రావు(22) వ్యవసాయం చేస్తున్నాడు. రెండేళ్లుగా నిత్యం మద్యం తాగుతున్నాడు. ఈ విషయమై తల్లి లక్ష్మి ఈ నెల 15న కొడుకును మందలించింది. జితేందర్ మనస్తాపంతో గ్రామ శివారులో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు కరీంనగర్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.


జితేందర్‌రావు

నేర వార్తలు

అప్పుల బాధ..

పాలకుర్తి(రామగుండం), న్యూస్‌టుడే: ఆదాయం ఖర్చులకే సరిపోతుండటం.. అప్పులు తీర్చలేక పోతున్నానని మనోవేదనతో ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. రామగుండం ఎస్సై సంధ్యారాణి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ముబారక్‌నగర్‌కు చెందిన షేక్ ఫిరోజ్(35) పంక్చర్ షాపు నిర్వహిస్తున్నాడు. ఇళ్ల నిర్మించడంతో ఫిరోజ్‌కు కొంత అప్పు అయింది. తన ఆదాయం ఇంటి ఖర్చులకే సరిపోతుంది.. అప్పులు తీర్చలేక పోతున్నానని బాధ పడుతుండేవాడు. అప్పుల వాళ్ల తరచూ ఇంటికి వస్తుండటంతో గత రెండు నెలలుగా అత్తగారింట్లో ఉంటున్నాడు. గురువారం మధ్యాహ్నం ఇంటిలో శుభకార్యానికి కుటుంబంతో సహా వెళ్లి తిరిగి వచ్చారు. అనంతరం తన సొంతింటిలో పడుకొని ఉదయాన్నే వస్తానని భార్యతో చెప్పి వెళ్లాడు. శుక్రవారం ఉదయం రాకపోవడంతో భార్య వెళ్లి చూడగా ఫిరోజ్ ఉరేసుకొని చనిపోయి ఉన్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. ఫిరోజ్‌కు ఇద్దరు కుమార్తెలున్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

ధర్మారం, న్యూస్‌టుడే: ధర్మారంలోని చింతల రాజు ఇంట్లో గురువారం రాత్రి దొంగతనం జరిగింది. ఆలస్యంగా వెలుగు చూసింది. రాజు కుటుంబ సభ్యులతో కలిసి కేశవపట్నం మండలం రాజాపూర్‌లోని బావమరిది ఇంట్లో జరిగే పూజకు వెళ్లారు. శుక్రవారం రాజు ఇంటి తాళాలు పగులగొట్టినట్టు ఇంటి వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్న యువకుడు గుర్తించి సమాచారం అందించారు. ఇంటికి వచ్చి చూసుకోగా బీరువాలో దాచుకున్న 38 గ్రాముల బంగారం, రూ.30 వేల నగదు చోరీకి గురయ్యాయని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై శీలం లక్ష్మణ్ పరిశీలించారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. కేసు నమోదు చేసి దొంగలను పట్టుకునేందుకు గాలిస్తున్నట్లు ఎస్సై వివరించారు.

కత్తితో వచ్చి చోరీకి విఫలయత్నం

మంథని గ్రామీణం, న్యూస్‌టుడే: మంథని పురపాలక పరిధిలోని గుంజపడుగులో ఓ మినీ ఏటీఎంలో శుక్రవారం ఓ దుండగుడు చోరీకి విఫలయత్నం చేశాడు. బాధితులు, స్థానికుల కథనం ప్రకారం.. మూస రజిత భర్త మరణానంతరం గుంజపడుగులో టైలరింగ్, మినీ ఏటీఎం నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. శుక్రవారం సాయంత్రం ఓ దుండగుడు కత్తితో షాప్‌లోకి చొరబడి రజితపై దాడికి యత్నించగా ఆమె తప్పించుకున్నారు. భయంతో కేకలు వేయడంతో చుట్టుపక్కల, రహదారి గుండా వెళ్లే వారు రావడంతో దుండగుడు పారిపోయాడు. ఈ దృశ్యాలు సీసీ ఫుటేజీలో రికార్డు అయ్యాయి. గ్రామస్థులు దుండగుడిని పట్టుకోవడానికి ప్రయత్నించినా చిక్కలేదు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. బాధితురాలు మంథని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం.





ఉత్సాహంగా ప్రతిభాపాటవ పోటీలు


‘ఈనాడు’ ఆధ్వర్యంలో శుక్రవారం పెద్దపల్లి గాయత్రి విద్యానికేతన్‌లో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ‘ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు.. విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం’ అంశంపై నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నూర్ సుల్తానా(9వ తరగతి), అక్షర(పదో తరగతి), గీతిక(9వ తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి విద్యా సంస్థల ఛైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రజనీదేవి, విజయ్, సృజన పాల్గొన్నారు.

–న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్

ప్రధాన రహదారి వెంట మురుగు కష్టాలు

పెద్దపల్లి పట్టణంలో రాజీవ్ రహదారి వెంట విస్తరించిన కాలనీలకు మురుగు కష్టాలు తప్పడం లేదు. రహదారి నిర్మాణ సంస్థ నిర్మించిన మురుగు కాలువలు అసంపూర్తిగా ఉండడం, వాటిని వినియోగంలోకి తేవడంలో మున్సిపాలిటీ నిర్లక్ష్యంతో స్థానికులకు మురుగుతో పాటు వరద నీటి కష్టాలు పరిపాటిగా మారాయి. ముఖ్యంగా పురపాలిక పరిధిలోని రంగంపల్లి, జిల్లా కోర్టు ప్రాంతంలో సమస్య తీవ్రంగా ఉంది. జిల్లా కోర్టు బస్టాప్ సమీపంలోని కల్వర్టు నుంచి వచ్చిన వరద లేదా మురుగు వెళ్లేందుకు రహదారి వెంట మురుగు కాలవ నిర్మాణం లేకపోవడంతో ఆర్‌ఆర్ గార్డెన్స్‌తో పాటు సమీపంలోని నివాస ప్రాంతాలను ముంచెత్తుతోంది. ఇదే వరద లారీ అసోసియేషన్ భవనం ప్రాంతంలో రాజీవ్ రహదారిపై ప్రవహిస్తోంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, పెద్దపల్లి



అక్రమ కట్టడాల తొలగింపు

గోదావరిఖని పట్టణం, న్యూస్‌టుడే: గోదావరిఖనిలోని పుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసుకున్న అక్రమ కట్టడాలను రామగుండం నగరపాలక అధికారులు శుక్రవారం తొలగించారు. నగరపాలక కార్యాలయం నుంచి ప్రధాన కూడలి వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా పుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. కొన్ని ఆక్రమణలను నగరపాలక అధికారులు తొలగించగా.. ప్రధాన కూడలి సమీపంలో యజమానులే తొలగించుకున్నారు. నగరపాలక పట్టణ ప్రణాళిక పర్యవేక్షకుడు(టి.పి.ఎస్.) పర్యవేక్షించారు.


ప్రధాన కూడలిలో నిర్మాణాలు తొలగిస్తున్న వ్యాపారులు

పశుపోషణలో ముందు జాగ్రత్తలే కీలకం

ధర్మారం, న్యూస్‌టుడే: పశుపోషణలో ముందుజాగ్రత్తలు తీసుకోవడం కీలకమని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా.బి.శంకర్ పేర్కొన్నారు. ఖిలావనపర్తిలో గాలికుంటు నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. పశువులకు సంక్రమించే కాలానుగుణ వ్యాధులు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. అన్ని గ్రామాల్లోనూ టీకాల పంపిణీకి ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మండల పశువైద్యాధికారి డా.అజయ్‌కుమార్, ఇబ్రహీం, హరీష్, వీఎల్‌వో రాజేందర్, జేవీవో అహ్మద్ పాషా, గోపాలమిత్రలు రాజేషం, వెంకటేషం, మల్లేశం, రైతులు పాల్గొన్నారు.


టీకాల పంపిణీని పర్యవేక్షిస్తున్న జిల్లా పశువైద్యాధికారి శంకర్

కార్మిక హక్కుల సాధనకు అలుపెరగని కృషి

పాలకుర్తి, న్యూస్‌టుడే: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగార ఒప్పంద కార్మికుల హక్కుల సాధనలో కౌశిక హరి కృషి మరువలేనిదని గుర్తింపు సంఘం ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కేశోరాం సిమెంట్ లారీ యార్డు ప్రాంగణంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కొమురయ్య, సతీష్, రమేష్, తిరుపతి, బాపు, నాగరాజు, మల్లయ్య, రామకృష్ణ, సాదిక్ పాల్గొన్నారు.

బోనస్ చెల్లింపులపై చర్చలు

కేశోరాం సిమెంట్ కర్మాగారంలో పనిచేసే ఒప్పంద కార్మికులకు దీపావళి బోనస్ చెల్లింపులపై గుర్తింపు సంఘం అధ్యక్షుడు కౌశిక హరి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో హెచ్ఆర్ అధికారులు పార్థసారథి, సదానందంలను కలిసి శుక్రవారం చర్చించారు.


సమావేశమైన కేశోరాం కార్మిక సంఘం నాయకులు, కార్మికులు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

పాలకుర్తి, న్యూస్‌టుడే: మండల కేంద్రానికి చెందిన కేశోరాం కార్మికుడు శాతరాజుల సతీష్ ఇటీవల పాము కాటుతో మృతి చెందిన విషయం విదితమే. లారీ ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రూ.25 వేల నగదును బాధిత కుటుంబానికి శుక్రవారం అందజేశారు. లారీ అసోషియన్ అధ్యక్షుడు నాగరాజు, సంతోష్, రమేష్, నారాయణ, వెంకటేష్, మల్లేష్ పాల్గొన్నారు.


నగదు అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

విద్యార్థులకు గైడ్ల పంపిణీ

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: కల్వచర్ల ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదివే ఆరుగురు విద్యార్థులకు రూ.3 వేల విలువైన ఎన్‌ఎంఎంఎస్(నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్) గైడ్లు, చూచిరాత పుస్తకాలు, పెన్నులను శుక్రవారం అందజేశారు. నవంబరు 24న నిర్వహించనున్న ఎన్‌ఎంఎంఎస్ ప్రతిభా పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు కల్వచర్లకు చెందిన సింగరేణి విశ్రాంత ఉద్యోగి వేముల వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శోభన్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పంపిణీ చేసిన గైడ్లతో విద్యార్థులు, దాత వెంకటేశ్వర్లు

జాతీయ స్థాయి అర్హత పరీక్షలో ఉత్తీర్ణత

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: రామగిరి మండలం పన్నూరు గ్రామానికి చెందిన కొండపర్తి శివకృష్ణ జాతీయ స్థాయి అర్హత పరీక్ష(యూజీసీ నెట్) కంప్యూటర్ సైన్స్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించారు. గురువారం ప్రకటించిన ఫలితాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి అర్హత పొందడంతో తల్లిదండ్రులు, గ్రామస్థులు ఆయనను అభినందించారు. పెద్దపల్లి మదర్ థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాలలో బోధిస్తున్న శివకృష్ణ ఇప్పటికే రాష్ట్ర స్థాయి అర్హత పరీక్ష(సెట్)లోనూ ఉత్తీర్ణత సాధించారు.


శివకృష్ణ

రాష్ట్ర స్థాయి కళోత్సవ్ పోటీలకు విద్యార్థిని

పాలకుర్తి, న్యూస్‌టుడే: పాలకుర్తి కేజీబీవీ పాఠశాలకు చెందిన తేజశ్రీ రాష్ట్ర స్థాయి కళోత్సవ్ పోటీలకు ఎంపికైనట్లు ప్రత్యేక అధికారిణి స్వరూప శుక్రవారం తెలిపారు. గురువారం పెద్దపల్లిలో జరిగిన జిల్లాస్థాయి కళోత్సవ్ పోటీల్లో సంప్రదాయ కథ చెప్పటం(ట్రెడిషనల్ స్టోరీ టెల్లింగ్)లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందని చెప్పారు. ఎంపికైన విద్యార్థిని ప్రత్యేక అధికారిణి స్వరూప, ఉపాధ్యాయినులు అభినందించారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన

కమాన్‌పూర్, న్యూస్‌టుడే: కమాన్‌పూర్‌లోని మూడో అంగన్‌వాడీ కేంద్రం, రామగిరి మండలం సుందిల్ల అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యులు కటారి రేవతి, సుధాలక్ష్మి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాల్లోని పిల్లలు, గర్భిణులు, బాలింతల వివరాలు ఉపాధ్యాయినులను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట సీడీపీవో పుష్పలత, సిబ్బంది ఉన్నారు.

ఆసుపత్రి సంపు నిర్మాణ పనులు ప్రారంభం

గోదావరిఖని పట్టణం, న్యూస్‌టుడే: గోదావరిఖని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రి ఆవరణలో సంపు నిర్మాణంలో జాప్యంపై ఈ నెల 5న ఈనాడు పత్రికలో ‘ఆసుపత్రిలో తాగునీటికి తంటాలు’ శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు, గుత్తేదారు స్పందించారు. ఆసుపత్రిలో సంపు నిర్మాణం పనులను శుక్రవారం మొదలుపెట్టారు.

ఈనాడు స్పందనకు వందనం

నేడు ప్రభుత్వ విప్ పర్యటన

ధర్మారం: ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శనివారం ధర్మారంలో పర్యటించనున్నారు. సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ మహిళా శక్తి క్యాంటీన్‌ను ఆయన ప్రారంభిస్తారని ఏపీఎం తులసీమాత తెలిపారు. నందిమేడారం సహకార సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్లో ధాన్యం సేకరణ కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు సీఈవో మల్లేశం చెప్పారు.

ఓసీపీ-5లో మల్టీ డిపార్టుమెంట్ కమిటీ పర్యటన

గోదావరిఖని, న్యూస్‌టుడే: మల్టీ డిపార్టుమెంట్ కమిటీ శుక్రవారం జీడీకే-5 ఓసీపీని సందర్శించింది. ఈ సందర్భంగా సీఎండీ వీడియో సందేశాన్ని ప్రదర్శించారు. గనుల పనితీరుతో పాటు మట్టి తొలగింపు, బొగ్గు రవాణాకు సంబంధించిన అంశాలపై కార్మికులకు అవగాహన కలిగించారు. ఈ ఏడాది నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించేందుకు ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేయాలన్నారు. ప్రమాద రహిత సింగరేణిగా తీర్చిదిద్దేందుకు రక్షణ సూత్రాలను పాటించాలన్నారు. ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, మేనేజర్ రమేశ్‌బాబు, అనిల్‌గబాలే, అధికారుల సంఘం ప్రతినిధి శ్రీనివాస్, గుర్తింపు సంఘం నాయకులు ప్రభుదాస్, పోశం, ఎల్లయ్య, ఆంజనేయులు, రాజన్న, డి.వి.రావు, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.



నిచ్చెన విరిగి కార్మికుడికి గాయాలు

యైటింక్లయిన్‌కాలనీ, న్యూస్‌టుడే: ఆర్జీ-2 డివిజన్‌లోని వకీలుపల్లెగని ఉపరితలంలో విధి నిర్వహణలో ఉన్న శిక్షణ ఎలక్ట్రీషియన్ పరమేష్ శుక్రవారం గాయపడ్డారు. అమ్మవారి ఆలయం వద్ద నిచ్చెన వేసుకొని పనులు చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు అది విరగడంతో కిందపడి పరమేష్‌కు గాయాలయ్యాయి. హుటాహుటిన కాలనీలోని సెక్టార్-3 సింగరేణి ఆసుపత్రికి అక్కడి నుంచి గోదావరిఖని సింగరేణి ప్రధాన ఆసుపత్రికి తరలించారు.

ఓసీపీ-I ప్రాజెక్టుకు 5 స్టార్ రేటింగ్

యైటింక్లయిన్‌కాలనీ, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణతో పాటు బొగ్గు ఉత్పత్తి, రవాణా, యంత్రాల వినియోగం, కార్మికుల సంక్షేమం, రక్షణ, తక్కువ ఖర్చు-ఎక్కువ ఉత్పత్తి అంశాల్లో అగ్రస్థానంలో నిలిచిన ఓసీపీ-1 ప్రాజెక్టుకు 5 స్టార్ రేటింగ్ కల్పిస్తూ శుక్రవారం భారత బొగ్గు మంత్రిత్వశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సంస్థలోని అన్ని ఉపరితల గనుల పనితీరును పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం ఓసీపీ-1 ప్రాజెక్టుకు 91 పాయింట్లు కేటాయించింది. ఈ నెల 21న దిల్లీలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి ఎన్.రాధాకృష్ణ ఈ అవార్డును అందుకోనున్నారు.



‘సంఘాలను నీరుగార్చేందుకు కుట్ర’

గోదావరిఖని, న్యూస్‌టుడే: కార్మిక సంఘాలను నిర్వీర్యం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని తెబొగకాసం అధ్యక్షుడు ఎం.రాజిరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. బడాఖానా పేరుతో ఆర్థిక దుర్వినియోగం జరుగుతుందన్నారు. దీన్ని అరికట్టేందుకు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. సంస్థకు సంబంధం లేని వ్యక్తులను ఆహ్వానించి కార్మికులను అవమానిస్తున్నారని.. దీన్ని ప్రశ్నించే కార్మికులకు ఛార్జిషీట్లు జారీ చేస్తున్నారన్నారు. సింగరేణిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, మితిమీరిన రాజకీయ జోక్యంతో సంస్థ భవిష్యత్తు అగమ్యగోచరంగా మారే అవకాశముందన్నారు.

బదిలీ వర్కర్‌లను క్రమబద్ధీకరించాలి

గోదావరిఖని, న్యూస్‌టుడే: సంస్థలో పనిచేస్తున్న బదిలీ వర్కర్‌లను క్రమబద్ధీకరించాలని సీఐటీయూ నాయకులు ఎం.శ్రీనివాస్, రాజమౌళిలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 190/240 మస్టర్లు నిండిన బదిలీవర్కర్‌లను జనరల్ మజ్దూర్‌లుగా క్రమబద్ధీకరించాలన్నారు. సెప్టెంబరు నెలలో ఇవ్వాల్సిన యాక్టింగ్ ప్రమోషన్‌లను ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు.

బోనస్‌పై మోసగిస్తున్న యాజమాన్యం

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: కాంట్రాక్టు కార్మికులకు దసరా బోనస్ ఇస్తామని చెప్పి ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ, సింగరేణి యాజమాన్యం మోసం చేస్తున్నాయని జడ్పీ మాజీ ఛైర్మన్ పుట్ట మధూకర్ ఆరోపించారు. శుక్రవారం ఆయన సెంటినరీకాలనీలో విలేకరులతో మాట్లాడుతూ రూ.5 వేల చొప్పున బోనస్ ప్రకటించిన ప్రభుత్వం ఇప్పటివరకు జాబితాను ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించారు. కంపెనీలు వెళ్లిపోయే సమయంలో 36 రోజుల వేతనాన్ని కాంట్రాక్టు కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట భారాస నాయకులున్నారు.

అసత్య ఆరోపణలు సరికాదు

కమాన్‌పూర్, న్యూస్‌టుడే: జడ్పీ మాజీ ఛైర్మన్ మధూకర్‌పై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోబోమని భారాస నాయకులు అన్నారు. కమాన్‌పూర్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మంత్రి మెప్పు కోసం కాంగ్రెస్ నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడటం సరికాదన్నారు. భారాస యువజన విభాగం మండల అధ్యక్షుడు బొమ్మగాని అనిల్‌గౌడ్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు సంపత్‌యాదవ్, మహిళా విభాగం అధ్యక్షురాలు పొన్నం రాజేశ్వరి, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

కమాన్‌పూర్, న్యూస్‌టుడే: కమాన్‌పూర్ మండలం రొంపికుంట విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో శనివారం సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

పెద్దపల్లి: రంగంపల్లి విద్యుత్తు ఉపకేంద్రం మరమ్మతుల కారణంగా శనివారం పెద్దకల్వల, పెద్దబొంకూర్, నిట్టూరు, నిమ్మనపల్లి, చందపల్లి ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ-1 శ్రీనివాస్ తెలిపారు.

ముత్తారం: ముత్తారం, అడవిశ్రీరాంపూర్, లక్కారం, ఖమ్మంపల్లి విద్యుత్తు ఉప కేంద్రాల పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ హనుమాన్‌దాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లైన్‌పై చెట్ల కొమ్మల తొలగింపు, ఇతర మరమ్మత్తుల దృష్ట్యా సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.

సంపద వనాల పరిశీలన

పాలకుర్తి(అంతర్గాం), న్యూస్‌టుడే: అంతర్గాం మండలం గోయల్‌వాడ, ఎల్లంపల్లి గ్రామాల్లో ఎంపీడీవో అలీం శుక్రవారం పర్యటించారు. ఆయా గ్రామాల్లోని నర్సరీ పనులు, సంపద వనాలను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ

ముత్తారం, న్యూస్‌టుడే: ముత్తారం మండలం కేశనపల్లిలో శుక్రవారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలు పంపిణీ చేశారు. డాక్టర్ కళ్యాణి, సిబ్బంది రేఖ వాణి, అశోక్, రమేష్, వెంకటేష్ రాములు, సారయ్య, తదితరులున్నారు.

సంఘాలు-కార్యవర్గాలు

ధర్మారం: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షునిగా రచ్చపల్లికి చెందిన చింతల తిరుపతిని నియమించినట్లు ఫోరం రాష్ట్ర కమిటీ ఛైర్మన్ చీమ శ్రీనివాస్ ప్రకటించారు.

● మున్నూరుకాపు సంఘం మండల అధ్యక్షుడిగా తన్నీరు రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా కొత్త మోహన్, కోశాధికారిగా అడువాల రవి, గౌరవ అధ్యక్షులుగా దీటి శ్రీనివాస్, మిట్ట తిరుపతి, కుంటూరు ప్రతాప్, గౌరవ సలహాదారులుగా శ్రీధర్, రాజేశం, శ్రీనివాస్, స్వామి, ఉపాధ్యక్షులుగా శ్రావణ్‌కుమార్, నర్సయ్య, ప్రేమ్‌సాగర్, శ్రీనివాస్, రాజేందర్ తదితర కార్యవర్గాన్ని నియమించారు.

రైతులకు ఉచితంగా భూసార పరీక్షలు

ధర్మారం: మండలంలోని రైతులకు ఉచితంగా భూసార పరీక్షలు నిర్వహించనున్నట్లు మల్లాపూర్‌కు చెందిన సాయిరామ్ ఆర్గానిక్స్ నిర్వాహకులు తెలిపారు. దీపావళి వరకు ఉచితంగా పరీక్షలు చేస్తామని చెప్పారు. రైతులు మట్టి నమూనాలతో పాటు పేరు, సర్వే నెంబరు, సాగు చేస్తున్న పంట వివరాలను అందజేయాలని సూచించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

మంథని, న్యూస్‌టుడే: మంథని సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల స్థలాలను జిల్లా సహాయ రిజిస్ట్రార్ నరేశ్ శుక్రవారం పరిశీలించారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు, శ్రీపాదకాలనీ, ఎగ్లాస్‌పూర్ కొనుగోలు కేంద్రాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఆయన వెంట మంథని సహకార సంఘం సీఈవో అశోక్‌కుమార్ ఉన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి నేడు వంటావార్పు

గోదావరిఖని: రైతుల సమస్యల పరిష్కారానికి జనగామ గ్రామంలో శనివారం వంటవార్పు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తెలిపారు. ఎల్లంపల్లి నుంచి నీటిని విడుదల చేసి జనగామ రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. నిండుకుండలా ఉన్న గోదావరి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎడారిగా మారిందని ఆరోపించారు.

నేత్రదానంతో అంధుల జీవితాల్లో వెలుగు

ఓదెల, న్యూస్‌టుడే: ఓదెలకు చెందిన మేకల ఓదెలు(70) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందగా కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దానం చేశారు. ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి మేర్గు భీష్మాచారి వారిని అభినందించారు. ఫౌండేషన్ బాధ్యులు ఇప్పనపెల్లి వెంకటేశ్వర్లు, కోండ్ర వేణు, క్యాతం వెంకటేశ్వర్లు, మల్లేశం, సారంగం తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన

ముత్తారం: గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని మంథని సీఐ బి.రాజు అన్నారు. ముత్తారం మండలం దర్యాపూర్ ఆదర్శ పాఠశాలలో శుక్రవారం ఎస్సై జి.నరేశ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం ఉంటే తమకు సమాచారం అందించాలని సీఐ సూచించారు. సైబర్ నేరానికి గురైతే 1930 నెంబరుకు కాల్ చేయాలన్నారు.

సబ్ ఇంజినీర్ బాధ్యతల స్వీకరణ

ముత్తారం, న్యూస్‌టుడే: ముత్తారం విద్యుత్తు శాఖలో సబ్ ఇంజినీర్‌గా సంతోష్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సబ్‌ఇంజినీర్‌ను సిబ్బంది సన్మానించారు. ఏఈ హనుమాన్‌దాస్, ఎస్ఎల్ఐ మల్లయ్య, ఎల్ఐ పోశమల్లుయాదవ్, ఎల్ఐ తాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

20న పద్మశాలీ దసరా మేళా

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: ఈ నెల 20న హైదరాబాద్ ఎల్బీనగర్‌లో నిర్వహించనున్న పద్మశాలి దసరా మేళా ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అడ్‌హక్ కమిటీ ఛైర్మన్ వల్స నీలయ్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సుల్తానాబాద్‌లో ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. సంఘం సభ్యులు చందు, సత్యనారాయణ, పరశురాములు, రాజేంద్రప్రసాద్, భాస్కర్ పాల్గొన్నారు.

బీసీజీ టీకాపై అవగాహన

ముత్తారం: కేశనపల్లిలో శుక్రవారం ఏఎన్ఎం కళావతి, పంచాయతీ కార్యదర్శి రాజేందర్‌లు బీసీజీ(బాసిల్లస్ కాల్మెట్ గ్యురిన్) టీకాపై ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించారు. 30 సంవత్సరాలు దాటిన వారిలో రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ బాధితులను గుర్తించి ఈ టీకాలు వేయనున్నట్లు చెప్పారు. తద్వారా క్షయ వ్యాధి బారిన పడకుండా చూడవచ్చన్నారు. ఆశా కార్యకర్త రాజేశ్వరి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.